క్లుప్తంగా

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 'వన్ స్టేషన్-వన్ ప్రోడక్ట్' స్టాల్



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ డి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 'వన్ స్టేషన్-వన్ ప్రోడక్ట్' స్టాల్‌ను సోమవారం చంచల్‌గూడ జైలు పర్యవేక్షణాధికారి నవాబ్ శివ కుమార్ గౌడ్ ప్రారంభించారు. అతి తక్కువ ధరలో నాణ్యతతో కూడిన వస్తువులను స్టాల్‌లో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. జైలు ఉప పర్యవేక్షణాధికారులు శ్రీనివాస్ రెడ్డి, విజయ్‌కుమార్, కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

5న వైశ్యుల బిజినెస్ మీట్

కాచిగూడ: వాసవి బిజినెస్ గ్రూప్ ఆధ్వర్యంలో నవంబర్ 5వ తేదీన బేగంపేటలోని టూరిజం ప్లాజాలో వైశ్యుల బిజినెస్ మీట్ నిర్వహించనున్నట్లు వీబీజీ వ్యవస్థాపకుడు మడిపడిగె రాజు తెలిపారు. వైశ్యుల వ్యాపారాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశంలో వైశ్య వ్యాపారులు పాల్గొని తమ వ్యాపార అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పాల్గొనే వైశ్యులు ఉచితంగానే ముందుగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 91215 74282, 89773 86707.

దివ్యాంగురాలి అదృశ్యం



అఫ్షా బేగం

నల్లకుంట: శారీరక, మానసిక వికలాంగురాలైన ఓ యువతి అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ శివ శంకర్ సమాచారం మేరకు... అంజయ్యనగర్‌లో నివాసముండే మహ్మద్ ఫహీమా అతని భార్య షహీన్ బేగం అనారోగ్యంతో మృతి చెందారు. శారీరక, మానసిక వికలాంగురాలైన ఆ దంపతుల కుమార్తె అఫ్షా బేగం అలియాస్ కౌసర్ బేగం(20) మామ మహ్మద్ జాఫర్ వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఈ నెల 28న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఆ యువతి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన జాఫర్ నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శుభాకాంక్షలు



రోహిణ్‌రెడ్డిని కలిసిన గోవర్ధన్‌రెడ్డి

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డిని సోమవారం గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కె. గోవర్ధన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ కండువాతో సన్మానించి, అంబర్‌పేటలో కాంగ్రెస్ జెండా ఎగిరేలా శక్తి వంచన లేకుండా తన వంతు కృషి చేస్తానని అభ్యర్థికి హామీ ఇచ్చారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయం

నల్లకుంట: ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిపై కత్తితో దాడి హేయమైనదని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దూసరి వెంకట్ గౌడ్ పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. హత్యా రాజకీయాలకు తెలంగాణలో స్థానం లేదన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికదాడులకు దిగడం సరికాదని హితువుపలికారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడడాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ సహించబోరని తెలిపారు.

చికిత్స పొందుతూ 'రిక్షాజీవి' మృతి

చిక్కడపల్లి: చిక్కడపల్లి లేబర్ కార్యాలయం ముందు రిక్షాలో నివసించే ఓ వ్యక్తి గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ నాగరాజు సమాచారం మేరకు... కార్మికశాఖ కార్యాలయం వద్ద ఫుట్‌పాత్‌పై రిక్షాలో నివసిస్తున్న శేఖర్(45)అపస్మారకస్థితికి చేరుకోవడంతో గత నెల మొదటి వారంలో పోలీసులు అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఆయన ఆరు నెలలుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఒక టీచర్ ఆయనకు రోజూ అప్పట్లో అన్నం పెట్టేది. రాయలసీమకు చెందిన శేఖర్ తల్లికూడా గతంలో చనిపోయింది. చూసేవారు ఎవరూ లేరని చివరకు రిక్షాలో ఒంటరిగా జీవించి... గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ చనిపోయారని పోలీసులు తెలిపారు.

ముషీరాబాద్ కాంగ్రెస్‌లో భారీ ప్రకంపనలు!

అభిషేక్‌రెడ్డి, కేశవ్, సమద్, నాగేంద్రప్రసాద్‌లతో పాటు పలువురు కాంగ్రెస్‌కు రాజీనామా?



టి.అంజయ్య మనుమడు అభిషేక్‌రెడ్డి



జి.ఎన్.కేశవ్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి



అబ్దుల్ సమద్, కాంగ్రెస్ మైనార్టీ సెల్



విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు 2వ తేదీన బీఆర్ఎస్‌లోకి...

ముషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల వేళ ముషీరాబాద్ కాంగ్రెస్‌కు భారీ కుదుపు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ జనహృదయ నేత దివంగత పి.జనార్దన్‌రెడ్డి (పీజేఆర్) తనయుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డిని దోమలగూడలోని ఆయన నివాసంలో మంత్రి హరీష్‌రావు సోమవారం ఉదయం కలిసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. విష్ణువర్ధన్‌రెడ్డికి మద్దతుగా అక్కడికి వచ్చిన అభిషేక్‌రెడ్డితో హరీష్‌రావు మాట్లాడి ఆయనను కూడా బీఆర్ఎస్‌లో చేరాలని కోరారు. అభిషేక్‌రెడ్డి ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, మూడుసార్లు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన టంగుటూరి అంజయ్య మనువడు. అలాగే అమ్మమ్మ మణెమ్మ కూడా రెండుసార్లు సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యురాలిగా, రెండు సార్లు ముషీరాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన కూడా కాంగ్రెస్ పార్టీ తీరుపట్ల అసంతృప్తిగా ఉంటూ ముషీరాబాద్ టికెట్ విషయంలో తమను ఏమాత్రం సంప్రదించడం లేదని, పార్టీలో గుర్తింపు లేదని భావించి పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో హరీష్‌రావు ఆహ్వానాన్ని మన్నించిన అభిషేక్‌రెడ్డి విష్ణుతో కలిసి వచ్చే నెల 2వ తేదన ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది. ఇక అభిషేక్‌తో పాటు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.ఎస్.కేశవ్, అడిక్‌మెట్ డివిజన్ మాజీ అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమద్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ ఇబ్రహీంలతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సైతం వీరిదారిలో పయనించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. నేడో రేపో పార్టీని వీడేది ఎవరు అనే దానిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర చైర్మన్ సోహెల్ కూడా అసంతృప్తితో ఉండడంతో హోం మంత్రి మహమూద్ ఆలీ సోహెల్ నివాసానికి వెళ్లి మంతనాలు సాగించినట్లు తెలిసింది. సోహెల్ నివాసానికి కూడా ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పలువురు నేతలు వెళ్లినట్లు సమాచారం. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ అసంతృప్త నేతలైన అభిషేక్ రెడ్డి బృందంతో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహతో పాటు ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జీ ఎంఎస్ ప్రభాకర్ కూడా మాట్లాడినట్లు తెలిసింది. కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న నల్లవెల్లి అంజిరెడ్డితో కూడా వీరు మాట్లాడుతున్నట్లు తెలిసింది. నవంబర్ 4వ తేదీ తరువాత నేను పార్టీ మారుతానని మరో నేత రావుల శ్రీకాంత్ పేర్కొన్నారు.

పోటీలో ఉంటా: జాన్ కెనడి



ముషీరాబాద్ కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న నగర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కృపారావు కుమారుడు జాన్ కెనడి ఈ దఫా ఎలాగైనా పోటీలో ఉంటానని స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో తమను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మొదటి జాబితాలో ముషీరాబాద్ టికెట్‌ను అంజన్‌కుమార్ యాదవ్‌కు ఇస్తున్నట్లు ప్రకటించిన ఇప్పటి వరకు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిని కలిసి మద్దతు ఇవ్వాలని కోరడం కానీ, అసంతృప్త నేతలను చేరదీయడం గానీ అంజన్ కుమార్ యాదవ్ చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రాధాన్యం



బీఆర్ఎస్‌లో చేరిన నేతలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ ప్రభాకర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: దేశంలో ఎక్కడలేని విధంగా మైనార్టీ సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గుల్షన్‌నగర్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు షరీఫ్ ఉద్దీన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో తాజ్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన వంద మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ముఠా గోపాల్, ఎంఎస్ ప్రభాకర్‌లను వై.శ్రీనివాస్‌రావు, పార్టీలో చేరిన నేతలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా, శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సబిల్ అహ్మద్, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం, నాయకులు మహ్మద్ ఆలీ, జునేద్‌బాగ్దాదీ, ఆజీపాషా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే ఆధునిక ధోబీఘాట్

చిక్కడపల్లి: బీజేపీ అభ్యర్థిని ముషీరాబాద్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆధునిక ధోబీఘాట్ నిర్మిస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ధోబీఘాట్‌లో ఇటీవల పూర్తయిన పైప్‌లైన్ పనుల నిమిత్తం బస్తీవాసుల పిలుపు మేరకు ఆమె బస్తీని సోమవారం సందర్శించారు. బస్తీలో నిర్మిస్తున్న షాబాద్ బండల ఫ్లోరింగ్ ఏర్పాటును ఆమె పర్యవేక్షించారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆమె స్పష్టం చేశారు. బీజేపీ నగర నేత వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, నాయకులు ఆకుల సురేందర్, లక్ష్మణ్‌యాదవ్, దోనేటి సత్యం, ఆనంద్‌రావు, ప్రశాంత్, సుధాకర్, స్థానిక స్థానిక బస్తీ వాసులు నగేష్, లక్ష్మి, వనమ్మ, లలిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీల నాయకత్వంపై కేసీఆర్ వ్యాఖ్యలు దారుణం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీల నాయకత్వాన్ని అపహాస్యం చేసేలా నరుకుడు గాళ్లు అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. బీసీ వర్గాల్లో రాజకీయ చైతన్యం పెరిగినా వారిని చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసు సురేష్ మాట్లాడుతూ... బీసీల రాజకీయ చైతన్యం పెరిగిందని ఎన్నటికైనా బీసీలు రాజ్యాధికారం చేపట్టాల్సిందే అని అన్నారు. సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ ఊరుమళ్ల విశ్వం, గ్రేటర్ అధ్యక్షురాలు బండారు పద్మావతి, గోషిక స్వప్న, ఎం.లక్ష్మి, దుర్గేష్, బండారు వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ రేసులో ఉన్నా: మద్దూరి శివాజీ



మద్దూరి శివాజీ

ముషీరాబాద్: భారతీయ జనతా పార్టీ యువ మోర్చా నగర అధ్యక్షుడు మద్దూరి శివాజీ బీజేపీ టికెట్ రేస్‌లో ఉన్నట్లు ప్రకటించారు. బూత్‌స్థాయి నుంచి నగర అధ్యక్షుడి స్థాయి వరకు చాలా సంవత్సరాలుగా కష్టపడి పని చేసి ఎదిగానని తెలిపారు. తన కుటుంబానికి కూడా బీజేపీలో ఎవరికి లేని నేపథ్యం ఉందని చెప్పారు. జనసంఘ్ వ్యవస్థాపకుల్లో తన తండ్రి మద్దూరి సంజీవరావు ఒకరని 1975 ప్రాంతంలో బీజేపీ అగ్రనాయకులు, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయి ముషీరాబాద్‌లోని తమ నివాసానికి వచ్చి ఒక రోజు ఉన్నారని గుర్తుచేశారు. ఎమర్జెన్సీలో తన తండ్రి సంజీవరావు ముషీరాబాద్ జైలులో తొమ్మిది నెలల పాటు జైలు జీవితం గడిపారన్నారు. విశ్వహిందూ పరిషత్‌కు గత 20 సంవత్సరాలుగా హోల్ టైమర్‌గా పని చేస్తున్నారని తెలిపారు. తన తల్లి చంద్రకళ నగర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పని చేశారని తెలిపారు. ఇటీవల టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్న తనపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించగా చంచల్‌గూడ జైలులో 16 రోజులు జైలు జీవితం గడిపానని ఇప్పటి వరకు తనపై తొమ్మిది కేసులు నమోదయ్యాయన్నారు. దళిత సామాజికవర్గానికి చెందిన నాకు టికెట్ ఇస్తే నియోజకవర్గంలోని సుమారు 30 దళిత వాడలు, 45 వేలకు పైగా ఉన్న ఓటర్లు తనను ఆదరిస్తారనే నమ్మకం ఉందన్నారు.

బీజేపీతో దళిత బహుజనుల భవితకు ప్రమాదం

కాచిగూడ: తెలంగాణలో బీసీలకు సీఎం పదవి అంటూ చెవిలో పువ్వు పెట్టిన దేశ ద్రోహుల పార్టీ బీజేపీ అని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. బీజేపీ నాయకత్వంతో మెజారిటీ దళిత బహుజన జాతుల భవిష్యత్‌కు అత్యంత ప్రమాదమని, సామాజిక భానిసత్వం తప్పదని ఆయన పేర్కొన్నారు. సోమవారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గంపై దాడులు చేస్తూ అణిచివేస్తున్న బీజేపీ పాలన రాష్ట్రాలు, బీజేపీ కాషాయం క్రిమినల్ శక్తులు అణగారిన జాతులను రాజకీయంగా వాడుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణలో మెజారిటీ బీసీ వర్గానికి బీసీ సీఎం అంటూ మోస పూరితంగా భ్రమల్లోకి నెట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్ర శాఖ బీజేపీ పార్టీకి ఉండే బీసీ నాయకత్వాన్ని తొలగించి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి నాయకత్వాన్ని తెచ్చారని మండిపడ్డారు. బీసీలకు చెందాల్సిన రాజ్యాధికారాన్ని మర్వాడి వైదిక బ్రహ్మణ మనువాదవర్గం కాజేసి దోచుకున్నారన్నారు. ఈ ఎన్నికల్లో దళిత బహుజనుల నాయకత్వంలోని రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఓటు వేసి అసెంబ్లీకి, చట్ట సభలకు పంపడం ద్వారానే బాధిత బీసీ, ఎస్సీ, ఎస్టీ సమాజానికి సోషల్ జస్టిస్, విముక్తి వస్తుందని అన్నారు.

బీఆర్ఎస్ వైపే యువత



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్నారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహల సమక్షంలో ఈడబ్ల్యూ క్వార్టర్స్‌కు చెందిన యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కారు గుర్తుకే ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డివిజన్ యూత్ జనరల్ సెక్రటరీ నితిన్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజస్, పార్టీ సీనియర్ నాయకులు వెంకటకృష్ణ(బబ్లూ), తెలంగాణ హౌస్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్‌రావు, నాగభూషణం, ఆర్. వివేక్, శంకర్‌ముదిరాజ్, ముదిగొండ మురళీ తదితరులు పాల్గొన్నారు.

గేమింగ్ హౌస్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

నిర్వాహకుడి సహా ఆరుగురి అరెస్టు

హిమాయత్‌నగర్: నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెం.11 లోని గేమింగ్ హౌస్‌పై సెంట్రల్ జోన్ పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి నిర్వాహకుడు గౌతం జైన్‌తో పాటు మరో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... పేకాట ఆడే వ్యసనం ఉన్న స్నేహితులతో కలిసి నిందితుడు ఈ గేమింగ్ హౌస్ నిర్వహిస్తున్నాడు. అతని స్నేహితుల ద్వారా పేకాట ఆడేవాళ్లను ఇంటికి పిలిపించి, ఒక్కొక్కరి నుంచి రూ. 1000 తీసుకొని ఆడేందుకు అనుమతించే వాడు. సమాచారం తెలుసుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గౌతమ్ జైన్ నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాట ఆడుతున్న మహేష్ కుమార్ ధూత్, సునీల్ కుమార్, వినోద్ కుమార్ పటక్,దీపక్ కుమార్ బహేతి, జైస్వాల్ సుదీప్, మొగిలి సూర్య ప్రకాష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 1.05 లక్షలు, రెండు ప్లేయింగ్ కార్డ్స్ సెట్లను సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం నిందుతులను నారాయణగూడ పోలీసులకు అప్పగించారు.

పద్మశాలీలకు సీట్లు కేటాయించిన పార్టీలకే మద్దతు

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు సీట్లు కేటాయించిన పార్టీలకే పద్మశాలీల పూర్తి మద్దతు ఉంటుందని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను ఆయా పార్టీల అధినేతలను కలిసి వివరించినట్లు తెలిపారు. ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు పద్మశాలీలను గుర్తించి సీట్లు కేటాయించాలని కోరారు. టికెట్లు కేటాయించకుండా పద్మశాలీలను నిర్లక్ష్యం చేసే పార్టీలను ఓడిస్తామని ఆయన అన్నారు.

బీఆర్ఎస్ ముషీరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జిగా ఎక్కాల కన్నా



కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా కాచిగూడ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎక్కాల కన్నాను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ నేపథ్యంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌ను ఎక్కాల కన్నా కలిసి పూలబొకే అందజేసి తనకు బాధ్యతలు అప్పగించినందులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముషీరాబాద్‌లో అందరిని కలుపుకొని పోతూ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

'కేసీఆర్ మాటలు నమ్మొద్దు'



లంబాడీ బస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పే అబద్ధపు మాటలు నమ్మవద్దని ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం రాంనగర్ డివిజన్‌లోని లంబాడీతండా, కమాన్ బస్తీ, శ్రీరామ్‌నగర్, సంజయ్‌నగర్, పాలమూరు బస్తీ, అక్షయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కల్లబొల్లి మాటలు చెప్పి కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణాన్ని తీర్చుకునే సమయం ఆసన్నమైందని అన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు కాసాని ఆనంద్, లోకేష్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పనయాదవ్, అంజియాదవ్, తోట విష్ణు, పాశం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం: అంజన్‌కుమార్‌యాదవ్



శివాలయం వద్ద కరపత్రాలు పంచుతున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: రాబోయే ఎన్నికల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యేగా గెలిపించండి అని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఇంటింటికీ వెళ్తూ కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీ పథకాల కరపత్రాలను పంచుతూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాను ఎంపీగా రెండు పర్యాయాలు ఉండి ముషీరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేశానని గుర్తుచేశారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించండి అని అంజన్‌కుమార్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, బి-బ్లాక్ కోకన్వీనర్ పట్నం నాగభూషణంగౌడ్, బి-బ్లాక్ మహిళా కమిటీ అధ్యక్షురాలు అనురాధ, మురళీ మోజెస్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు జనిగే శ్రీనివాస్‌యాదవ్, నాయకులు లింగంగుప్తా, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో 'అంబర్‌పేట్' అభివృద్ధే లక్ష్యం

బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కాచిగూడలో ప్రచారంలో ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేయనున్నట్లు అంబర్‌పేట అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం కాచిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలు, బస్తీల్లోని స్థానికులు బీఆర్ఎస్ పార్టీ గెలుపుకోసం ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలను నమ్మించేందుకు అమలు కానీ హామీలను గుప్పిస్తున్నారని, వీరికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన విసాల్ మిత్ర బృందం, యువకులు

చిక్కడపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ముషీరాబాద్‌లో పలు డివిజన్‌లల్లో యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్నారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, యువ నాయకుడు ముఠా జైసింహల సమక్షంలో అరుంధతినగర్ బస్తీకి చెందిన విసాల్ మిత్ర బృందంతో పాటు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో నాయకులు శ్రీని వాస్‌గుప్తా, రాజ్ కుమార్, శ్రీకాంత్, రవిశంకర్ గుప్తా, చందు, జహంగీర్, సుధాకర్ పాల్గొన్నారు.